
నరేంద్ర ఆఫీసుకొచ్చాడు. టైము తొమ్మిదిన్నరే అయిందప్పుడు.



అప్పుడే అక్కడకొచ్చి సైకిల్ స్టాండ్ వేస్తున్న ప్యూన్ యాదగిరి, నరేంద్రను చూసి అదిరిపడ్డాడు.

పదిగంటలకు ఆఫీసయితే పది గంటలకే వచ్చే మేనేజర్లను చాలా మందిని తను చూశాడు గానీ, ఇలా తొమ్మిదిన్నరకే వచ్చేసిన వారెవ్వరూ లేరు.

నరేంద్ర ఆఫీస్ వరండాలోకి నడిచాడు. యాదగిరి అతనికో నమస్కారం పెట్టి తనూ వినయంగా వెనుకే నడిచాడు.



# సమ్మె

— యర్రంశెట్టి శాయి

ఆఫీస్ తలుపు లేము తెరవనే లేదింకా.

"యాదగిరీ!" పిలిచాడు నరేంద్ర.

"యస్సార్!"

"ఆఫీసు తొమ్మిది గంటలకే తెరిచి శుభ్రం చేయాల్సిన బాధ్యత నీకుందని తెలుసా?

"తెలుస్సార్!"

"మరి నువ్వు తొమ్మిదిన్నరకు ఆఫీసు కెలా వచ్చావ్?"

"...............".

"మిగతా ప్యూన్లు కూడా ఎవరూ రానేలేదింత ఎరకూ! కదూ?"

"అవునండి!"

"ఇదే ఫస్ట్ అండ్ లాస్ట్ వార్నింగ్! రేపట్నుంచీ తొమ్మిది గంటలకల్లా మీలో ఎవరు ఇక్కడ కనిపించకపోయినా సస్పెండ్ చేస్తాను."

"మంచిది సార్!"

ప్యూన్ తన గది తలుపులు తాళం తీశాక గదిలోకి నడిచాడు నరేంద్ర. అప్పటికప్పుడే కిటికీలు తెరిచి గది శుభ్రం చేశాడు యాదగిరి.

పదిగంటలయేసరికి ఆఫీస్ స్టాఫంతా ఒక్కరొక్కరే రావడం ప్రారంభమయింది.

నరేంద్ర అంతా గమనిస్తూనే ఉన్నాను.

కాలింగ్ బెల్ నొక్కాడతను.

"యస్సార్!" ప్యూన్ వచ్చాడు.

"అటండెన్స్ రిజిష్టర్ తీసు కొచ్చి ఇక్కడ టేబుల్ మీదుంచు!"

"అలాగే సార్!"

రెండు నిమిషాల్లో అటెండెన్స్ రిజిష్టర్ అతని టేబుల్ మీద కొచ్చింది. అందులో చాలామంది సంతకాలు లేవు. సెక్షన్ ఆఫీసర్స్ అందరిని పిలిపించాడతను. అందరూ అతని కెదురుగా నిల బడ్డారు.

"ఇంతకు ముందు ఇక్కడ స్టాఫందరూ ఆఫీసు కెన్ని గంటలకు వచ్చే వాళ్ళో నాకు తెలీదు. కానీ ఈ రోజు నుంచీ పదిగంటల పది నిమిషాల తర్వాత అటండెన్స్ రిజిష్టర్లు మార్క్ చేసి నాకు పంపించాలి మీరు. ఒకవేళ పదీ పదికి అటండెన్స్ రిజిష్టర్లు నాకు చేరకపోతే మీ మీద చర్య తీసుకోవాల్సి వస్తుంది."

"అలాగేనండి!"

"ఇంక మీరు వెళ్ళవచ్చు. ఇవాళ ఆలస్యంగా వచ్చిన వాళ్ళం దరినీ నా దగ్గరకు పంపండి!"

"అలాగే సార్!"

వాళ్ళు వెళ్ళిపోయారు. మరో అయిదు నిముషాల తర్వాత ఓ వ్యక్తి అతని గదిలో కొచ్చేడు.

"గుడ్ మాణింగ్ సర్!" అన్నాడు వినయంగా నమస్కరిస్తూ.

"గుడ్ మాణింగ్! ఎవరు?"

"నా పేరు రమణారావండి! డిశ్పాచ్ సెక్షన్ క్లర్కుని!"

"ఏం కావాలి?"

"అటండెన్స్ రిజిష్టర్ లో సంతకం చేయాలని..."

"ఇంత ఆలస్యంగా ఎందుకు

రావాల్సి వచ్చింది ఆఫీసుకి?"
"అనుకోకుండా సైకిల్ పంక్చ రయింది సార్!"
"అలాగయితే లేట్ పర్మిషన్ పెట్టు!"
"అలాగే సార్!"
"అంతే కాదు- రేపట్నుంచీ టైముకి రాకపోతే లీవ్ పెట్టాల్సి వస్తుంది."
"సరే సార్!"
సంతకం పెట్టి వెళ్ళిపోయా డతను. అతను వెళ్ళగానే మరో వ్యక్తి వచ్చాడు.
"గుడ్ మార్నింగ్ సర్!"
"గుడ్ మార్నింగ్!"
"నా పేరు యూసఫుద్దీన్! యూనియన్ సెక్రటరీని!"
"ఏం కావాలి నీ కిప్పుడు?"
"అటండెన్స్‌లో సంతకం పెట్టాలి!"
"ఆఫీస్ ఎన్ని గంటలకో తెలుసా?"
"పది గంటలకు."
"మరి ఇంత ఆలస్యంగా ఎందు కొచ్చినట్లు?"
"బస్ మిస్సయింది సార్!"
"ఇలా మిస్సయ్యే బస్సెక్కి ఎన్నాళ్ళు టైముకి చేరుకోగలవు?"
అతను జవాబివ్వలేదు. ఈ కొత్త మేనేజర్ ప్రవర్తన అతనికి ఒళ్ళు మంటగా ఉంది. 'ఏ మేనేజరైనా తనను చూడగానే భయపడి సీటు ఆఫర్ చేసేవాళ్ళు. అసలు తనే నాడూ 11, 12 గంటల లోపు ఆఫీసుకొచ్చిన పాపాన పోలేదు. మరి ఇంతవరకూ ఆ విషయం ఎవరూ ప్రశ్నించలేదు తనని. అంత భయం యూనియన్ లీడర్లంటే ఆఫీసర్లకి. అలాంటిది నిన్నగాక మొన్న వచ్చాడో లేదో....'
"ఇవాల్టికి లీవ్ తీసుకో! రేప ట్నుంచీ టైముకి రా!" చెప్పాడు నరేంద్ర.
"నేను యూనియన్ సెక్రటరీని! టైముకి ఆఫీసుకి రావడం నాకు కుదరదు. నాకు చాలా స్టాఫ్‌కి సంబంధించిన పనులుంటాయ్!" కిరకుగా అన్నాడతను.
"ఆ పనులన్నీ టైముకి ఆఫీసు కొచ్చి, ఆ తరువాత చూసుకోవాలి. డిసిప్లిన్‌కి లోబడి ఉండడం నీకే సాధ్యం కాకపోతే, అంతమంది స్టాఫ్‌ని ఎలా డిసిప్లిన్‌లో ఉంచ గలవ్?"
"ఆల్ రైట్! మీతో వాదన నా కనవసరం! ఇవాళ సెలవు తీసు కుంటున్నాను."
"దటీజ్ గుడ్!"

యూసపుద్దీన్ కోపంగా బయటి కెళ్ళిపోయాడు. ఆ తరువాత మిగతా వాళ్ళెవరూ అటండెన్స్‌లో సంతకాలు పెట్టడానికి రాలేదు. అందరూ శెలవు తీసేసుకున్నారు.

మర్నాడు మాత్రం పదీపదికల్లా అందరి సంతకాలతో అటండెన్స్ రిజిష్టర్లు నరేంద్ర టేబుల్ మీద కొచ్చేసాయ్.

అది చూసి కొంత సంతృప్తి కలిగిందతనికి. 'ఒక దుర లవాటుని చాలా త్వరగా మానిపించగలిగాడు తను. తనకు ముందున్న మేనేజర్లందరూ ఈ స్టాఫ్‌కిలా ఎందుకు అలుసిచ్చేరో-అర్థంకావడంలేదు ఆ ఆఫీసు నిజానికి ఆఫీస్‌లా లేదు. క్లబ్‌లా కనిపించింది తనకి. ఎవరిష్టం వచ్చినప్పుడు వాళ్ళు రావడం, వచ్చినవాళ్ళు ఇష్ట మొచ్చినంత సేపు పని చేయడం, లేదా ఎక్కడో తిరిగి టైమ్ పాస్‌చేసి వెళ్ళిపోవడం....'

వచ్చిన మొదటిరోజే ఇవన్నీ గమనించి ఈ అస్తవ్యస్త పరిస్థితులన్నింటినీ మార్చేయాలని నిర్ణయించుకున్నాడతను.

'ఉద్యోగస్తులను పీడించడం తన అభిమతం కాదు. వారిని బాధ పెట్టడం తనకిష్టంలేదు. కానీ ఆఫీసులో పెరిగిపోతున్న నిర్లక్ష్య వైఖరీ, ఎన్ని నెలలయినా ఫైల్స్ కదలని పరిస్థితీ, లంచగొండితనం-ఇవన్నీ రూపు మాపాలి! వీటి కోసమే తను కృషి చేయదల్చుకున్నాడు.'

మర్నాడు మధ్యాహ్నం మూడింటికి హఠాత్తుగా తన గదిలోనుంచి ఆఫీస్ హాల్లోకి నడిచాడు నరేంద్ర.

హాలంతా గందరగోళంగా ఉంది. ఒకో టేబుల్ దగ్గరగా ఇద్దరు ముగ్గురు గుమికూడి ఏదో లోకాభిరామాయణం ముచ్చటించుకుంటున్నారు.

నరేంద్రను చూడగానే అందరూ ఎవరి సీట్లలోకి వారు జారుకున్నారు. ఐదు నిమిషాలు సెక్షన్ ఆఫీసర్ టేబుల్ దగ్గర నిలబడి, ఆఫీస్ పరికించాడు నరేంద్ర.

నాలుగు సీట్లు ఖాళీగా కనిపించాయతనికి. అక్కడికి సెక్షన్ ఆఫీసర్‌తోపాటు నడిచాడతను.

"ఈ సీట్ ఎవరిది?"

"రాజేష్‌బాబుదండీ!"

"అతనేడీ?" అటెండెన్స్ రిజిష్టర్ చూసి అడిగాడు నరేంద్ర. సెక్షన్ ఆఫీసర్ ఏమీ చెప్పలేకపోయాడు.

"వాట్ మిస్టర్! వేరీజ్ దిస్ జంటిల్మన్?" పక్క సీటతనిని అడిగాడు.

"అయ్ డోంట్ నో- సర్!"

"ఆల్ రైట్! ఇతనికి అబ్సెంట్ మార్క్ చేయండి!" సెక్షన్ ఆఫీసర్‌తో చెప్పి మరో సీట్ దగ్గరకు నడిచాడు.

"ఇక్కడెవరు?"

"రామచంద్రం."

"ఎక్కడికి కెళ్ళాడు?"

"కాంటిన్ కెళ్ళాడండీ!"

"ఇది కాంటిన్‌కి వెళ్ళే టైమ్ కాదని అతనికి తెలీదా?"

"............"

"ఇతనికి కూడా అబ్సెంట్ వేయండి!"

"............"

"ఇలా ఆఫీస్ సమయంలో కాంటిన్ కెళ్ళడం, బజారు కెళ్ళడం ఇంటి పని చూసుకోవడం నేను సహించను. మరొకసారి ఇలా ఎవరైనా పట్టుబడితే క్రమశిక్షణ చర్యతీసుకుంటాను."

"అలాగే సార్!"

ఆ మర్నాడు తను రెండుసార్లు చెప్పినా ఫైల్సు కొన్ని పుటప్ చేయని నరసింహాన్ని సస్పెండ్ చేసాడు నరేంద్ర. మరో రోజు ఎస్టాబ్లిష్‌మెంట్ క్లర్క్ రంగరాజు ఫైల్స్ మధ్య బ్రాకెట్ చార్ట్ పెట్టుకుని దానికి సంబంధించిన లెక్కలేవో వేస్తూ దొరికిపోయాడు.

ఆ తరువాత రామానుజం, కంట్రాక్టర్ దగ్గర లంచం తిని


చదవండి! చదివించండి!

బొమ్మరిల్లు పబ్లికేషన్స్

ఈ నెల విడుదలైన నవలలు

మహాబలి రాక్షసుడు

మాయా పిల్లన గ్రోవి

వివరాలకు :

బొమ్మరిల్లు పబ్లికేషన్స్
80-ధనలక్ష్మి కాలనీ,
మద్రాసు-600 026.

అతనికి అనుకూలంగా నోట్ పుటప్ చేసి నరేంద్ర చేతిలో ఇరుక్కు పోయాడు. మరో రోజు రాజారావ్, ఇబ్రహీం తాగి ఆఫీస్ కొచ్చినందుకు బయటకు గెంటి వేయబడ్డారు.

ఇంకో రోజు శ్రీకంఠమూర్తి ఓల్డ్ రికార్డ్ రూమ్‌లో రికార్డ్స్ వెనుక నిద్ర పోతూ దొరికి పోయాడు.

ఆఫీస్ అన్ని విధాలా ఓ దారికి తేవడానికి నెల రోజులు పట్టింది నరేంద్రకు.

ఇప్పుడు అందరూ పది గంట లకు అయిదు నిమిషాలు ముందే ఆఫీస్ చేరుకుని అయిదు గంటల వరకూ కదలకుండా పని చేస్తు న్నారు. ఫైల్సన్నీ అతి వేగంగా కదులుతున్నాయి. లంచాలు చాలా వరకూ తగ్గిపోయినయ్.

అప్పటికిగ్గాని తేలిగ్గా గాలి పీల్చుకోలేదు నరేంద్ర.

'ఇంక తనున్నా లేకపోయినా ఏం ఫరవా లేదు. ఆఫీసు విషయా లన్నీ ఓ రొటీన్‌లో జరిగి పోతాయ్' అనుకున్నాడు.

ఆ మర్నాడు అతను పదిగంట లకు ఆఫీస్ చేరుకునేసరికి ఆఫీస్ తలుపులన్నీ అలాగే మూసి ఉన్నాయ్.

ఆశ్చర్యపోయాడు నరేంద్ర. పదింపావు అయినా ఒక్కరు కూడా రాలేదు. తన దగ్గరున్న తాళం చేతుల్తో తన గది తలుపు తెరచుకొని లోపల కుర్చీలో కూర్చున్నాడతను.

'ఒక్కరు కూడా రాకపోవ డానికి కారణమేమయి ఉంటుందా?' అని ఆలోచిస్తూండగానే బయట దూరంగా కేకలు వినిపించాయి.

కిటికీలో నుంచి రోడ్డు వైపుకి చూశాడు నరేంద్ర. పెద్ద ఊరే గింపు! అంతా తన ఆఫీసు ఉద్యో గులే!

అందరికంటే ముందు యూస ఫుద్దీన్ నడుస్తూ గట్టిగా అరు స్తున్నాడు-

"మేనేజర్ — డౌన్ డౌన్!"

"మేనేజర్ నిరంకుశత్వం— నశించాలి!"

"మేనేజర్ దుర్మార్గం- నశిం చాలి!"

"మేనేజర్ ఉద్యోగుల వ్యతి రేక చర్యలు- నశించాలి!"

"ఎంప్లాయీస్ యూనిట్- వర్ధిల్లాలి!"

నరేంద్ర నిశ్చేష్టుడయి నిలబడి పోయేడు దద్దరిల్లుతున్న కేకలతో ఊరేగింపు అతనికి అతిసమీపంగా వచ్చేస్తోంది. *